కథా నిలయం
3879
శ్రీకాకుళం

# తెల్లవారినతూర్పు

"ఏమిట్రా మింగుతున్నారు? మాట్లాడరేం..." రాధిక విసుక్కుంటూ పిల్లలిద్దర్నీ రెండు అంటించింది.

కవల పిల్లలిద్దరూ జంటగా ఏడుపు లంకించుకున్నారు.

"ఎందుకమ్మా పిల్లలను అట్లా చెండుకు తింటావ్? ... అరటిపండు నైవేద్యం పెట్టాను. దాన్ని తుంచి, చెరిసగం వాళ్ళ చేతుల్లో పెట్టాను. దానికోసం ఇంత రాద్ధాంతమా?" పూజా మందిరంలోంచి వస్తూ రామనాథం జవాబుగా అన్నాడు.

"అడ్డమైన గడ్డీ తింటే...పిల్లల ఆరోగ్యం ఏంగానూ.." నొసలు చిట్లించి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది,

"రాధికా!... దేవుడి ప్రసాదం నీ కళ్ళకు గడ్డిలా అవుపిస్తోందా? తప్పమ్మా! నన్నేమన్నా బాధ లేదు. కానీ అభంశుభం తెలియని పసివాళ్ళను అనవసరంగా కొట్టకు తల్లీ!"

"నా పిల్లల సంగతి నాకు బాగా తెలుసు..." అనేసి, మరోటి అంటించి, "యూనిఫారం వేసుకుని రెడీ అవండి. స్కూలుకి వేళయింది. మరో పది నిముషాల్లో ఆయా వచ్చేస్తోంది." గొణుక్కుంటూ పిల్లలిద్దర్నీ రెక్కలు పట్టుకుని విసురుగా లాక్కెళ్ళింది.

రామనాథం మనస్సు చివుక్కుమన్లేదు.

కారణం! ఆ యింట్లో అంతకంటే విపరీతమైన సంఘటనలు గతంలో చాలా వుత్పన్నమైనాయ్.

అరవై సంవత్సరాల రామనాథం జీవితం సినిమా రీలులాగా గిర్రున తిరిగి పోయింది.

రిటైరయ్యాక కూడా ఇంకా తననెవరు గౌరవిస్తారు. తాను సంపాదిస్తున్నన్నాళ్ళూ అందరికీ కావాల్సివచ్చింది.

ఇప్పుడు తన యిష్టా యిష్టాలతో నడుచుకోవాల్సిన అవసరం ఎవ్వరికీ లేదు. అన్నిటికీ తానే తలవంచుకుని జీవిత చరమాంకాన్ని వెళ్ళదీయాలి.

పిల్లలు పెద్దవాళ్ళయి, పిల్లల తండ్రులుకూడా అయిన తర్వాత ఇంకా తన సలహాలు ఎవరు పాటిస్తారు? వాళ్ళ జీవితాలకు తాను ఏ విధంగానూ వుపయోగపడ లేదు.

*   *   *   *

ముగ్గురు మగ పిల్లలలో చివరి వాడంటేనే రామ నాథానికి ఎక్కువ ప్రేమ.

పెద్దవాడు భిలాయిలో ఇంజనీరు. రెండోవాడు ఢిల్లీలో మిలటరీ ఆఫీసరు.

మొదటి నుండి బెజవాడ వదిలి ఎక్కడికో పోయి వుండటం రామనాథానికి సుతరామూ ఇష్టంలేదు.

ఆ కారణంగానే...మూడో కోడలు నిత్యమూ సూటి పోటి మాటలంటూ తనను నిర్లక్ష్యం చేస్తున్నా... అన్నిటికీ సర్దుకుపోతున్నాడు.

బెజవాడ మీద వల్లమాలిన అభిమానం ఏర్పడటానికి కారణాలు ముఖ్యంగా మూడు.

తన పందొమ్మిదవఏట మొట్టమొదటి సారిగా వుద్యోగంలో కుదిరి పర్మినెంటు అయింది అక్కడే ... ముప్పైఏళ్ళ సర్వీసు ముగించి రిటైరయిందీ బెజవాడలోనే!!-

పై రెండూ కాక బలీయమైన కారణం మూడోదుంది—

బ్రతికినన్నాళ్ళూ కష్టసుఖాల్లో పాలుపంచుకుని.... తన కంటికి వెలుగై...జీవితానికి ఆశాజ్యోతి అయిన సహధర్మచారిణి శాంత అకస్మాత్తుగా కన్నుమూసి శాశ్వతంగా తనకు దూర మైంది బెజవాడలోనే!!!

భార్య అంత్యక్రియలు కృష్ణానది ఒడ్డునే జరిగాయి.

ఆ రోజునుండి ఈ రోజు వరకూ ప్రతి సాయంకాలమూ కృష్ణ వొడ్డుకు వెళ్ళి భార్యకి అంత్యక్రియలు జరిగిన స్థలానికి

దగ్గర్లో కూర్చుని... ఆమెసాహచర్యంలో తాను అనుభవించిన సుఖాన్ని మననం చేసుకుని, అశ్రుతర్పణం చేయుటం రామనాథం దినచర్యలో ముఖ్యమైనది. అలా చేయుటంలో వున్న తృప్తి, హాయి మరెందులోనూ కన్పించదు.

అందుకే.. ఆ వూరు వదిలి మరోచోటికెళ్ళి వుండలేదు! వుండడు!!!

*　　*　　*

రామనాథం దృష్టిలో రాజా వట్టి అమాయకుడు. అంతకు మించిన భోళామనిషి.

రాజా వుద్యోగం తాలూకా ఆఫీసులో గుమస్తాగిరి అయినప్పటికీ......తనకంటే పెద్దచదువు చదివి పెద్దవుద్యోగం చేసే అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు.

అది వాళ్ళు ప్రేమించి చేసుకున్న పెళ్ళి. ఆ కారణంగానే భార్యమాటకు ఎదురుచెప్పలేదు - చెప్పడు.

వారి పెళ్ళికి ఇష్టం వున్నా, లేకపోయినా విధిగా తల వంచాల్సి వచ్చింది రామనాథం.

ఇంట్లో పెత్తనమంతా కోడలిదే! ఎందుకూ పనికిరాని తననే కాదు.... కట్టుకున్న మొగుడ్ని సైతం దులపరించి మాట్లాడటం, అలక్ష్యంగా ప్రవర్తించటం నిత్యం చూస్తూ, నోరు నొక్కుకోవాల్సివస్తోంది, రామనాథం.

తాను ఎంత ఇబ్బందిపడినా సరే. వాళ్ళకు తానెంత

మాత్రం భారంకాకూడదనే వుద్దేశంతో అతిజాగ్రత్తగా వ్యవహరిస్తూ రోజులు దొర్లిస్తున్నాడు.

*　　　　*　　　　*

రామనాథానికి స్నేహితులంటూ ఎవ్వరూలేరు. స్నేహాల పట్ల బొత్తిగా సదభిప్రాయంలేని మనిషి.

అనవసరమైన పిచ్చాపాటీ మాటలతో అటు క్లబ్బుల్లోనో.. ఇటు వీధి అరుగుల మీదనో కాలక్షేపం చేయటం బొత్తిగా గిట్టదు.

తీరిక చిక్కినప్పుడల్లా ఓపికవున్నా, లేకపోయినా విధిగా గీతాపారాయణం చేసుకోవటం... ఆతర్వాత అవకాశముంటే మనుమలతో పసివాడిలా ఆడుకోవటం .... ఇది ఆయన దినచర్య.

ఆదివారం కావటంతో కొడుకూ కోడలూ పిల్లల బాధ్యత తనకప్పగించి ఆరు గంటలకల్లా షాపింగ్‌కని బైట కెళ్ళారు స్కూటరుమీద.

తనూ బైటికెళ్ళాల్సిన టైముకావస్తోంది. మనుమలను కూడా తనవెంటనే తీసుకెళ్ళేందుకే నిశ్చయించుకున్నాడు.

బట్టలుమార్చుకుని, పిల్లల్ని వెంటబెట్టుకుని రోడ్డుమీద కొచ్చాడు రామనాథం.

తాతయ్యా!... ఇప్పుడు మనంఎక్కడికెళ్తున్నాం?–"

ఒక మనుమడి ప్రశ్న.

"మనల్ని తాతయ్య సినిమాకి తీసుకెళ్తాడు. కదు తాతయ్యా?" రామనాథాన్ని మాట్లాడనీయకుండా తెల్సిన వాడికిమల్లే రెండోవాడు జవాబిచ్చాడు.

"సినిమాకేం కాదు. మనం సర్కసుకు వెళ్తున్నాం.... అవునా?" మళ్ళీ మొదటి వాడి ప్రశ్న.

"సినిమాలూ.... సర్కసులూ ఎప్పుడూ చూసేవే గదాని.. మిమ్మల్ని ఇప్పుడు కొత్త చోటికి తీసుకెళ్తున్నాను. ఎక్కడికో చెప్పుకోండి!" మనుమల్ని వుడికిస్తూ వాళ్ళ ముఖాల్లోకి చూశాడు.

తాత మనసులో వుద్దేశ్యమేమిటో పసివాళ్ళ మేధకు అందకపోవటంతో ప్రశ్నార్థకంగా ఒకరినొకరు చూచుకున్నారు.

ఓ కొట్టుదగ్గర ఆగి చాక్లెట్లు కొనిపెట్టాడు. "ఇక చెప్తా వినండి అనేసరికి, పిల్లలిద్దరూ చాక్లెట్లు నోట్లో వేసుకుని చెవులు రిక్కించారు.

"మీ బామ్మని మీరు చూడలేదుకదా..." ఇద్దరివంకా చూస్తూ అడిగేడు.

"చూడలేదుగామరి.." ముక్తకంఠంతో అన్నారిద్దరూ.

"అందుకే... మీ బామ్మని చూపించేందుకు తీసికెళ్తున్నాను... తెల్సిందా? —"

"భలే...భలే... తాతయ్య మంచివాడు..." అన్నాడొకడు.

"మనింట్లో ఫోటోలో వున్న బామ్మ నేనా!" అని ఎదురు ప్రశ్న వేశాడు మరొకడు.

కృష్ణ వొడ్డుకు చేరుకున్నారు ముగ్గురూ. ఎండాకాలం కావటంతో నదిలో నీరు పూర్తిగా ఎండిపోకపోయినా... నది మధ్యలో సన్నటి నీటిపాయ దరిద్రుడి అరచేతిలో అదృష్ట రేఖలా వుంది.

సూర్యాస్తమయమైంది. కాని, ప్రకృతిలో వెలుగు పూర్తిగా అదృశ్యం కాలేదు.

ఇసుకలో మనుమలిద్దర్నీ చెరో ప్రక్క కూర్చోబెట్టుకున్న రామనాథం, "శాంతా! ఈ రోజు నేనొక్కడినే రాలేదు. ధైర్యం చేసి నీ మనుమల్ని కూడా వెంటబెట్టుకొచ్చాను నీకు చూపించాలని. లవకుశుల్లాగ ఎంత ముద్దొస్తున్నారో చూడు శాంతా!...అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు.

"తాతయ్యా...నీవు మాట్లాడుతోంది..." అనుమానంతో ఇద్దరూ అడిగేరు.

"బామ్మని చూపిస్తానని తీసుకొచ్చి... నీలో నువ్వే మాట్లాడుకుంటున్నావేం...?" రామనాథాన్ని మొదటి ప్రశ్నకు జవాబు చెప్పనీకుండా మళ్ళీ అడిగాడు,

"అవున్రా... చూడండి! పరీక్షగా చూడండి!! ఎదురుగా చెట్టు కన్పిస్తోందే... ఆ చెట్టుకిందే కూర్చుని చేతులు చాచి మిమ్మల్ని పిలుస్తోంది. మీకు కన్పించటంలేదూ?...."

"ఏదీ?... ఎక్కడా?... మాకు కన్పించందే..."

దిక్కులు చూస్తూ అడిగేరు.

"శాంతా నువ్వు వాళ్ళకి కన్పించటం లేదట. ఒక్కసారి కన్పించవూ! ఏం మాట్లాడవు? ఇంత కాలంగా ఎందుకు తీసుకొచ్చి చూపించ లేదని కోపం వచ్చిందా? ఏం చేయమంటావ్ చెప్పు? స్వతంత్రించి ఏ పని చేసేందుకూ...ఇప్పుడు నాకు ఇంట్లో ఏ విధమైన స్వతంత్రం గానీ, అధికారంగానీ లేదు. శాంతా! మొన్న రోడలేమన్నదో తెలుసా! తన పిల్లల సంగతి తనకే బాగా తెల్సట మనం మాత్రం పిల్లల్ని కని పెంచలేదూ! వాళ్ళ కష్ట సుఖాలూ, మంచి చెడులూ మనకు మాత్రం తెలీవా? శాంతా! నేనిప్పుడు ఎవ్వరికీ ఏమీకాను. నాతో ఎవ్వరికీ పన్లేదు. అందరూ వుండి ఎవ్వరూ లేని వాడినయ్యాను. నువ్వు నాకు ఎప్పుడు దూరమైనావో...ఆ రోజునే నేను అన్నీ పోగొట్టుకున్నాను..." వుద్వేగంతో పసివాడిలా కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు.

"తాతయ్యా!... ఏడుస్తావెందుకూ? మాకు భయమేస్తోంది. చీకటిగా కూడా వుంది ... ఇంటికెళ్దాంపద..." ఇద్దరూ మారాము చేయసాగేరు.

పై పంచతో కళ్లొత్తుకుని. "వెళ్తాం పదండి, మీ అమ్మానాన్న కూడా ఇంటికొచ్చే వుంటారు —" అంటూ లేచాడు.

రోడ్డు మీదికొచ్చి రిక్షా ఎక్కేరు.

* * *

"ఎక్కడికెళ్ళార్రా ఇద్దరూ?" ఇంట్లో అడుగు పెట్టగానే పిల్లలను చూస్తూ గద్దించింది రాధిక.

బెదిరిపోయిన పిల్లలు సమాధానం చెప్పలేక పోవటం గమనించిన రామనాధం, "షికారుకని... నేనే అలా బైటికి తీసుకెళ్ళాను." సంజాయిషీ చెప్పుకున్నాడు.

"అవును మమ్మీ!... బామ్మను చూడడానికెళ్ళాం... బిక్కు బిక్కుగా జవాబిచ్చాడొకడు.

"తాతయ్యేమో... కన్పించని బామ్మతో మాట్లాడేడు. మాకేమో భయంవేసింది..." అసలు జరిగిందేమిటో చెప్పకుండా వుండలేక పోయేడు రెండోవాడు.

"ఏదేదో మాటాడుతూ... తాతయ్యేమో... ఏడ్చేశాడు కూడా..." ఒకే కంఠంతో పలికేరిద్దరూ.

రాధికలో కోపం శృతిమించింది.

పిల్లల్ని చెరొకటీ అంటించింది రాధిక.

"రాధికా!... నా కారణంగా పిల్లల్ని కొట్టద్దు తల్లీ. నా మాట విను! ఇంకెప్పుడూ తీసుకెళ్ళన్లే... సరేనా?!" నిందితుడులాగ తలొంచుకున్నాడు రామనాధం.

"చూచారా? మీ నాన్నగారి నిర్వాకం. అభమూ శుభమూ తెలీని పసివాళ్ళను స్మశానాల్లోకి తీసుకెళ్తారా? వాళ్ళు జడుసుకుంటే ఎంత ప్రమాదం? మనపిల్లలు మనకు దక్కాలనే చేశారా ఇంతపనీ!?" ఎదురుగా వున్న భర్త నుద్దేశించి అంది రాధిక.

రాజా నోరు అసలు మెదపనే లేదు.

రాధికలో కోపం మరీ రెచ్చిపోయింది.

"మనం పిల్లాజల్లాతో పచ్చగా వుండటం మీ నాన్న గారికి ఇష్టంలేదన్లే వుంది. మనం వుండగా... సర్వాధికారాలు ఆయనే చెలాయించటం నాకిష్టంలేదు. మిమ్మల్ని కన్న నేరానికి ఇన్నాళ్ళూ సహిస్తూ వున్నాను. ఇక ఇట్లా జరగటానికి వీల్లేదు. ఈఇంట్లో ఆయనైనా వుండాలి... లేదూ నేనైనా వుండాలి. . పెద్దా చిన్నా గౌరవమైనా లేకుండా నోటికొచ్చినట్లల్లా రాధిక మాట్లాడుతుంటే ఇటు రామనాథం గానీ ... అటు ఎదురుగా వున్న రాజాగానీ వారించలేకపోయారు.

"ఇంతకూ... నేను చేసిన ఘోరమైన తప్పేమిటో నాకేమీ బోధపడలేదు..." అనిమాత్రం అనగలిగేడు రామ నాథం.

"ఏది ఏమైనా మీరిక్కడే వుండటం అంత మంచిది కాదనిపిస్తోంది." రాధిక మాటల్లో కాఠిన్యం ధ్వనించింది. అంతకు మించిన తుది నిర్ణయమూ ద్యోతకమైంది.

"రాజా!... నేను ఈ వూరు వదిలి ఎక్కడికీ వెళ్ళ లేనయ్యా..." రామనాథం మాటల్లో అభ్యర్థన, పైపెచ్చు జాలీ కన్పించింది.

"అట్లా చూస్తూ వూరుకుంటారేమండీ?... కొడుకులు ముగ్గురూ సరి సమానంగా మీ నాన్నగారిని పోషించాలి... అలాంటిది...బ్రతికినన్నాళ్ళూ ఇక్కడే తిష్ట వేస్తానంటే ఎట్లా!"

రామనాథం నిర్జీవై నాడు.

రాజా బదులు చెప్పలేదు.

పిల్లలతో ప్రారంభమైన యుద్ధం...చివరికి వాటాలు వారసత్వాల దాకా వచ్చింది.

రాత్రి పదిగంటలైనా ఇంట్లో ఏ ఒక్కరూ కంచాల ముందు కూర్చున్న పాపాన పోలేదు.

పిల్లలిద్దరూ ఏడ్చి ఏడ్చి నిద్రపోయారు. తనకేమీ పట్ట నట్లు రీడింగ్ రూములో కూర్చుని ఏదో చదువుకుంటున్నాడు రాజా. మేడమీద గదిలోకెళ్ళి తలుపు గడియ పెట్టుకుంది రాధిక.

ఇంట్లో దారుణ నిశ్శబ్దం విలయ తాండవం చేస్తోంది.

కాళ్ళకు చెప్పులు తగిలించుకుని మళ్ళీ రోడ్డెక్కాడు రామనాథం.

రిక్షాలో కూర్చున్న రామనాథం ఆలోచన్లు పరిపరి విధాల పరుగెత్తసాగేయి.

కృష్ణ వొడ్డు చేరుకుంది రిక్షా.

పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ ఇసుకలో నడుస్తు న్నాడు రామనాథం.

మామూలు స్థలం చేరుకోగానే రామనాథంలో దుఃఖం కట్టలు త్రెంచుకుంది.

"విన్నావా శాంతా! నేను అందరికీ బరువైపోయాను.

నేనిప్పుడెవ్వరికీ అక్కర్లేదు. అవమానాలతో నేను అనుభవిస్తున్న నరకయాతన పగవాడికూడా వద్దు. శాంతా! నీకేం శాంతా... ఎక్కడో దూరంగా నువ్వు హాయిగా వున్నావ్...మరి నేనో... శాంతా! నా బాధలు నీతో కాక

మరెవరితో చెప్పుకోమంటావ్ ? కానీ...నువ్వు నన్ను అర్థం చేసుకున్నంతగా... కడుపున పుట్టిన పిల్లవాడు కూడా అర్థం చేసుకోలేక పోయాడు. కోడలు నన్ను అనరాని మాటలంటుంటే ... వింటూ వూరుకున్నాడే కానీ...కనీసం రాజా నోరైనా మెదపలేదు శాంతా! ... నా దౌర్భాగ్యం ఎలా వుందో చూశావా..." ఇంకా ఏవో మాటలు...మధ్యమధ్య వెర్రి నవ్వులు...

* * *

తూర్పు భళ్ళున తెల్లవారింది!

రామనాథం శరీరం శాంత మట్టిలో ఐక్యమైన చోట కనిపించింది. (జూన్ 77 విజయ మాసపత్రికలో ప్రచురితము.)

★


వెరైటి! నాణ్యత! మన్నిక!

దర్శించండి !!

మహారాణి టెక్స్‌టైల్స్

క్లాత్ షోరూమ్

పాత తాలూక కచ్చేరిరోడ్, చిత్తూరు 517001